నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# మెదక్

ఆదివారం 3 డిసెంబర్ 2023
SUNDAY, DECEMBER 3, 2023 | MEDAK | పేజీలు : 8 PAGES





రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం



గీతం యూనివర్సిటీలోని కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సంగారెడ్డి ఎన్నికల అధికారి శరత్

# గెలుపెవరిదో..!

- నేడు కౌంటింగ్.. అందరిలో ఉత్కంఠ
- తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

- ఉదయం 8గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం
- మొదట పోస్టల్ బ్యాలెట్లు.. ఆతర్వాత ఈవీఎం ఓట్ల లెక్కింపు
- సంగారెడ్డి జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 8400
- ఈవీఎంలలో పోలైన ఓట్లు 10,73,014
- 11 గంటల తర్వాతే ఫలితాలు, మొదట నారాయణఖేడ్ ఫలితం వెలువడే అవకాశం
- రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు
- ఐదు నియోజకవర్గాల కౌంటింగ్ గీతం వర్సిటీలోనే...
- ఓట్ల లెక్కింపులో పాల్గొననున్న సిబ్బంది 800 మంది
- 500 మందితో పటిష్టమైన బందోబస్తు
- కౌంటింగ్ కేంద్రాల ఆవరణలో 144 సెక్షన్ అమలు
- ఐదు నియోజకవర్గాల ఫలితాలపై అభ్యర్థులు సహా అన్నివర్గాల్లో ఆసక్తి

-లోపలి పేజీల్లో..

**అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు** మరికొన్ని గంటల్లో వెల్లడి కానున్నాయి. గురువారం పోలింగ్ ముగిసిన సంగతి తెలిసిందే. ఆదివారం ఓట్ల లెక్కింపు ఉండడంతో అభ్యర్థుల భవితవ్యం తేలనున్నది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్‌ను రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేశారు. ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుందని, ముందుగా 8,400 పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నట్లు కలెక్టర్, సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి శరత్ తెలిపారు. ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి నియోజకవర్గానికి 16నుంచి 18 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 17 రౌండ్లు మాత్రమే ఉండడంతో నారాయణఖేడ్ ఫలితం ముందుగా వెల్లడయ్యే అవకాశం ఉన్నది. అభ్యర్థులతోపాటు పోలింగ్ కేంద్రాల సంఖ్య ఎక్కువగా ఉండడంతో పటాన్‌చెరు ఫలితం ఆలస్యంగా వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. జిల్లాలో మొత్తం 102 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కౌంటింగ్ కోసం పోలీసులు మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రాన్ని సీసీ కెమెరాల్లో పర్యవేక్షించనున్నారు. కౌంటింగ్ నేపథ్యంలో గీతం యూనివర్సిటీ పరిసరాలతోపాటు జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు. 500 మందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

- సంగారెడ్డి (నమస్తే తెలంగాణ)/ పటాన్‌చెరు, డిసెంబర్ 2



హవేళీఘనపూర్ వైపీఆర్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లు..

**విజయం** ఎవరిని వరించునో తెలిసే రోజు నేడు. మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ హవేళీఘనపూర్‌లోని వైపీఆర్ కళాశాలలో ఆదివారం జరగనున్నది. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల రాజకీయ భవితవ్యం నేడు తేలనున్నది. జిల్లాలో రెండు నియోజకవర్గాల నుంచి ఎన్నికల బరిలో 24 మంది అభ్యర్థులు ఉన్నారు. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానున్నది. మెదక్ నియోజకవర్గంలో 274, నర్సాపూర్ నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మెదక్‌లో 20 రౌండ్లు, నర్సాపూర్‌లో 22 రౌండ్లలో ఓట్లు లెక్కించనున్నారు. తొలుత మెదక్ ఫలితం వెలువడనున్నది. కట్టుదిట్టమైన భద్రతతో ఎన్నికల కౌంటింగ్ జరుగుతుందని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. స్ట్రాంగ్ రూంల వద్ద సీఆర్‌పీఎఫ్ బలగాలతో కూడిన మూడంచెల భద్రతను సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

- మెదక్ (నమస్తే తెలంగాణ), డిసెంబర్ 2

# మెదక్‌దే.. తొలిఫలితం

## నేడే కౌంటింగ్.. వీడనున్న ఉత్కంఠ



హవేళీఘనపూర్‌లోని కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మెదక్ ఎన్నికల అధికారి రాజర్షి షా

- తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- హవేళీఘనపూర్‌లోని వైపీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు
- ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ షురూ
- 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు
- మెదక్ నియోజకవర్గంలో 20 రౌండ్లు
- నర్సాపూర్ నియోజకవర్గంలో 22 రౌండ్లు
- కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన భద్రత
- సాయుధ బలగాలు, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలు
- మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా